ప్రజాశక్తి
శనివారం 14 అక్టోబర్ 2023
అనంతపురం



సిఎం బహిరంగ సభకు స్థల పరిశీలన

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టపర్తికి రానున్న తరుణంలో అందుకు అవసరమైన సభా ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈనెల 19న జగనన్న చేదోడు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఎం హాజరవుతున్న నేపథ్యంలో పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలోని స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తులసి రఘురాం పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ఎయిర్‌పోర్టు సమీపంలో గల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు .ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, కలెక్టరు ఎస్పీతోసిఎం పర్యటన వివరాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, డీఆర్వో కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ నవీన్ కుమార్, వైసిపి నాయకులు మాధవరెడ్డి, రంగారెడ్డి, గంగాధర్, నరసారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ ఇతర జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రతి కుటుంబానికీ రెండు ఎకరాల సాగు భూమి పంపిణీ చేయాలి

భూపోరాటంలో పేదలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

రాష్ట్ర భూ సదస్సులో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్



పట్టణంలో నాయకుల మహాప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్

ప్రజాశక్తి -పెనుకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల కొమ్ము కాస్తున్నాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్ విమర్శించారు. శుక్రవారం శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండ పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర భూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అధ్యక్షతన పేదలకు భూమి కోసం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిధులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి, వి. రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సిపిఎం నాయకులు శివనాగమణి, దిల్షాద్, ఇఎస్ వెంకటేశ్వర్లు, సుబ్బి రెడ్డి, పెద్దన్న, ప్రవీణ్, శ్రీనివాసులు, ధనాపురం వెంకటరామిరెడ్డి, కదిరిప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వాలు పేదలకు సాగు భూములు పంచడంలో పూర్తి విఫలమయ్యాయన్నారు. గత ప్రభుత్వాలతో పాటు ప్రస్తుత ప్రభుత్వాలు సైతం పేదలకు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వడం లేదన్నారు. సాగుదారులకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. దున్నే వాడిదే భూమి అని తెలిపారు. భూములు ఇస్తారా లేక దున్నుకోమంటారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదేవిధంగా ఇళ్ల స్థలాలు లేక పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే వాటిని తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇస్తారా లేక ఆక్రమించుకోమంటారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదల భూములను సెజ్‌ల పేరుతో తీసుకుంటూ పేదలకు భూములు లేకుండా చేస్తున్నారన్నారు. కియా పరిశ్రమకు భూములు తీసుకున్న వారి రైతు కుటుంబాలకు ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. పేదల భూములు కాదు ధనవంతుల భూములు తీసుకోవాలన్నారు. ఒక వేల పేదల భూములు తీసుకోవాల్సి వస్తే ఆ కుటుంబాలకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అభివృద్ధికి, పరిశ్రమల ఏర్పాటుకు సిపిఎం వ్యతిరేకం కాదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నరేంద్ర మోడీ అండ చూసుకొని అసైన్మెంట్ చట్టాన్ని సవరించారన్నారు. ఇది చాలా దుర్మార్గమైన చర్య అని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. పేదలకు అండగా ఎర్రజెండా ఉంటుందని తెలిపారు.పేదలకు పెత్తందారులకు మధ్య యుద్ధం జరుగుతోందని, పెత్తందారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని అన్నారు. ఆఖరికి స్మశానవాటికలకు స్థలాలు లేకుండా చేశారని విమర్శించారు. ప్రతి ఒక్కరికి రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలతోపాటు ఇంటి నిర్మాణానికి సంబంధించి కేంద్రం రూ. 5లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు మొత్తం రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళలో ఎర్రజెండా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ 7,40,000 ఇస్తోందన్నారు. అదేవిధంగా కేరళలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 13 రకాల వస్తువులను పంపిణీ చేస్తున్నారని మన రాష్ట్రంలో కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అన్ని వస్తువులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు రంగంలో కూడా రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. భూములకై పోరాడుతున్న పేదలపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పుట్టపర్తి జిల్లాలో అధికంగా భూ పోరాటాలు జరుగుతున్నాయని అన్నారు. పేదలకు భూ పంపిణీ జరిగేంత వరకు ఇళ్ల స్థలాలు దక్కేంతవరకు సిపిఎం వారికి అండగా ఉండి పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం కర్నాటక రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముణి వెంకటప్ప, చిక్కబలాపురం జిల్లా నాయకులు రాఘునాథ్ రెడ్డి , చెన్నరాయప్ప, స్థానిక సీనియర్ నాయకులు హరి, సాంబ శివ, రమేష్, గంగాధర్, బాబావలి, వెంకటరాముడు, తిప్పన్న, నారాయణ, కొండా వెంకటేష్, హనుమయ్య, వెంకటేష్, రంగప్పతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు,సాగుదారులు, పేదలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ప్రజలు, మహిళలు

భూపంపిణీని చేర్చి దశరత్నాలుగా ప్రకటించాలి



నవరత్నాలలో భూ పంపిణీ పథకాన్ని చేర్చి దశరత్నాలుగా మార్చి ప్రభుత్వ బంజర్లు మిగులు భూములు పేదలకు పంచాలి. అన్యాక్రాంతమైన భూములను తిరిగి పేదలకు ఇవ్వాలి. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులు అమలు చేయాలి. బలవంతపు భూసేకరణ ఆపాలి. పేదల చేతుల్లో ఉన్న స్థలాలకు, గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి.

దడాల సుబ్బారావు,
సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు

భూపోరాటంలో పాల్గొన్న పేదలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



భూములకై పోరాడుతున్న పేదలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి. ప్రభుత్వ భూములను పేదల భూములను కార్పొరేట్లకు ప్రభుత్వాలు కట్టి పెడుతున్నాయి. ఏళ్ల తరబడి భూములు సాగు చేసుకుంటున్న సాగుదారులకు పట్టాలు పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి.

ప్రభాకర్‌రెడ్డి,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

అర్హులందరికీ రెండు ఎకరాల భూమి ఇవ్వాలి



అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలి. భూములు సేకరిస్తున్న చోట 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి. ప్రభుత్వాలు పేదలకు భూములు పంపిణీ చేయడం లేదు. కేరళ బెంగాల్ త్రిపుర రాష్ట్రాలలో 20 లక్షల ఎకరాలకు పైగా పేదలకు భూములు పంచారు. పేదల గుడిసెలు వేసుకున్న చోటే ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటాలు పెద్దఎత్తున చేస్తాం,

రాంభూపాల్,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

పేదల భూములు లాక్కొంటున్న ప్రభుత్వం



రాష్ట్ర అభివృద్ధి, రోడ్ల నిర్మాణం, ప్రాజెక్టులు, జగనన్న కాలనీల నిర్మాణం పేరుతో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కొంటోంది. సత్య సాయి జిల్లాలో పరిగి, మడకశిర, సోమందేపల్లి, చిలమత్తూరు, లేపాక్షి, ఎన్‌పి కుంట, కనగానపల్లి, గోరంట్ల, రొద్దం తదితర మండలాల్లో పేదల భూములు పరిశ్రమలకు తీసుకొని నామమాత్రంగా నష్టపరిహారం ఇచ్చారు. పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు రక్షణగా ఉన్న 9/77 చట్టాన్ని జగన్ ప్రభుత్వం శాసనసభలో సవరించింది. ఈ చట్టాన్ని సవరించడంతో భవిష్యత్తులో పేదల చేతుల్లో భూములు లేకుండా పోయే ప్రమాదం ఉంది.రొద్దం మండలంలోని కోగిర, కంబాలపల్లి, శాపురం గ్రామాలలో ప్రభుత్వ భూములను ఏళ్ళకొద్దీ సాగు చేసుకుంటున్న సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి. చిలమత్తూరు మండలంలో పేదలు వేసుకున్న గుడిసెలను రెవిన్యూ అధికారులు పోలీసుల ద్వారా బలవంతంగా తొలగించి గుడిసెలకు నిప్పు పెట్టారు.

ఇంతియాజ్
సిపిఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి

సెంట్రల్ యూనివర్శిటీలో అభివృద్ధి పనులు వేగవంతం

కలెక్టర్ ఎం.గౌతమి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని బుక్కరాయసముద్రం మండలంలోని జంతులూరు గ్రామం వద్ద జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సెంట్రల్ యూనివర్శిటీ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జిల్లాలో సెంట్రల్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తోందన్నారు. యూనివర్సిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. ఇందుకోసం అవసరమైన సహాయ సహకారాలు ఎలాంటి ఆలస్యం చేయకుండా అందించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే సోమవారం నుంచి ప్రహరీ పనులు మొదలుపెట్టాలన్నారు. యూనివర్సిటీకి విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న 33 కెవి సబ్ స్టేషన్ కోసం భూసేకరణ చేపట్టాలన్నారు. అనంతపురం – తాడిపత్రి హైవే నుంచి యూనివర్సిటీకి రెండు వరసల రహదారి నిర్మాణం చేపట్టేలా చూడాలని, ఈ విషయమై ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలను ఫాలోఅప్ చేయాలని చెప్పారు. వచ్చే మార్చి అకాడమిక్ ఏడాదికి యూనివర్సిటీలో తరగతులు మొదలు పెట్టాలా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హనుమాన్ కెనడి, పిఆర్ ఎస్ఇ భాగ్యరాజ్, సిపిడబ్ల్యుడి ఈఈ శ్రీనివాస్, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ సురేంద్ర, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ ఇషాన్ బాషా, హెచ్ఎల్‌సి ఎస్ఇ రాజశేఖర్, ఏపీఎస్సిఆర్ఐసి ఈఈ ప్రభాకర్ రెడ్డి, ఏపీఎస్సిఆర్ఐసి ఏఈ సుదర్శన్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ ఎన్.తిరుపతి, ఏపీఎస్పీడీసీఎల్ ఏడీ వివేకానంద స్వామి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ పుణ్యవతి, తహశీల్దార్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి : జిల్లాలో వివిధ రైల్వే ప్రాజెక్టుల లెవెల్ క్రాసింగ్‌లకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో వివిధ రైల్వే ప్రాజెక్టుల లెవెల్ క్రాసింగ్ లకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వే ప్రాజెక్టుల లెవెల్ క్రాసింగ్ లకు సంబంధించి సమయపాలన నిర్దేశించుకుని సర్వే, భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, అనంతరం భూమిని అప్పగించాలని అన్నారు. రైల్వే ప్రాజెక్టులపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమీక్ష చేస్తున్నారని, అత్యంత ప్రాముఖ్యత ఇచ్చి ఆయా ప్రాజెక్టుల లెవెల్ క్రాసింగ్ పనులు వేగంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో 17 రకాల రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. రైల్వే ప్రాజెక్టుల లెవెల్ క్రాసింగ్ లకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చిన ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతిపాదించిన చోట్ల రైల్వే గేట్లను మూసివేసేందుకు, బ్రిడ్జిల నిర్మాణం ఆలస్యం కాకుండా చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రైల్వే శాఖకి అన్ని శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అనంతపురం, గుంతకల్లు ఆర్డీవోలు మధుసూదన్, రవీంద్ర, రైల్వే శాఖ డీఈ రమణరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, ఆర్అండ్ బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ కరుణాకర్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ, డిప్యూటీ తహశీల్దార్ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వామపక్ష నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సిపిఎం అనుబంధ రైతుసంఘం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుమ్మక్కై ప్రజల నెత్తిన విద్యుత్ ఛార్జీల భారాలు మోపుతున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.1,400 కోట్లు ప్రజలపై భారం మోపాయన్నారు. ఇది చాలదన్నట్లు ప్రతిఇంటికీ, దుకాణానికీ స్మార్ట్ మీటర్లు పెట్టి అధిక భారాన్ని మోపేందుకు పూనుకున్నాయన్నారు. ఈమోసాలను ప్రజలు ప్రతిఘటించాలన్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 16న చేపట్టనున్న నిరసనకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యుత్ ఛార్జీల భారాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు జగ్గిలి రమేష్, సిపిఎం నాయకులు మారుతీ ప్రసాద్, తిమ్మప్ప, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గౌస్, నాయకులు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పెరుగుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు : జెఎన్‌టియు రెక్టార్

ప్రజాశక్తి-అనంతపురం



మాట్లాడుతున్న జెఎన్‌టియు రెక్టార్ విజయకుమార్

ప్రపంచంలో ఇతర వ్యర్థాలు కంటే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వేగంగా పెరుగుతున్నాయని జెఎన్‌టియు రెక్టార్ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రైస్ యువర్ హాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో ఈ–వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సును నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఇతర అన్ని వ్యర్థాల కంటే ఎలక్ట్రానిక్ వ్యర్థాలే ఇప్పుడు ప్రపంచంలో వేగంగా పెరుగుతున్న వ్యర్థ ప్రవాహంగా మారిపోయాయన్నారు. ఈ సమయంలో తక్కువ వ్యర్థాలను ఉత్పత్తి చేసే పరిశ్రమలను సృష్టించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారన్నారు. అంతేగాకుండా వ్యర్థాలను రీసైకిల్ చేసే మెరుగైన పరిశ్రమను సృష్టించాల్సిన అవసరం ఉందని వివరించారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.శారద, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, అనంతపురం డిప్యూటీ కమిషనర్ జి.రమణారెడ్డి, డైరెక్టర్ మహేష్‌బాబు, గ్రీన్ ఆర్మీ ప్రెసిడెంట్ అనిల్, నెహ్రూ యువ కేంద్రం ఇన్‌ఛార్జి డైరెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఇ సిటీ ప్రెసిడెంట్ జి.విశ్వనాథ్, ఆర్‌వైహెచ్ ప్రెసిడెంట్ జె.శ్రీకాంత్, ఎం.రామశేఖర్‌రెడ్డి, బి.అజిత, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిఐటియు రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నేటి నుంచి రెండు రోజుల పాటు గణేనాయక్ భవన్‌లో సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా నాయకులు ఎటిఎం.నాగరాజు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న ఈ సమావేశాలకు అనేక ఉద్యమాల్లో అనుభవం కలిగిన నాయకత్వం హాజరుకానున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖల్లో, పథకాల్లో పని చేస్తున్న కార్మిలను, అసంఘటిత కార్మికులను ఐక్యం చేసి సిఐటియు పోరాడుతోందన్నారు. కార్మికుల సమస్యలపై చర్చించి, భవిష్యత్ పోరాట కార్యచర్యణ రూపొందించనున్నట్లు తెలిపారు. దేశ ఆర్థిక అభివృద్ధి సామాజిక భద్రత కోసం కృషి చేస్తున్న బ్యాంకులు, ఎల్.ఐ.సి., రక్షణ రంగం, ఫార్మ రంగం, గనులు ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీలను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేస్తోందన్నారు. రూ.లక్షల కోట్ల సంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతోందన్నారు. భూగర్భ పైపులైన్లు, కేబుల్స్, విద్యుత్ ఉత్పత్తి, అంతరిక్ష ప్రయోగాలు, ఆయుధ కర్మాగారాలు, రైళ్లు, ఓడరేవులు, ఉక్కు, సిమెంట్, పరిశ్రమలను ప్రైవేటు రంగానికి కట్టబెడుతున్నారు. ఈ చర్యలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలను ఐక్యం చేస్తూ నిరంతరం ప్రజావ్యతిరేక విధానాలను అడుగడుగునా ఎదుర్కొని కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో తన భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకోవడానికి సిఐటియు ప్రాంతీయ నాయకత్వం అనంతపురం నగరంలో రెండు రోజులపాటు సమావేశమవుతోందన్నారు. కర్నూల్, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు తెలిపారు.

19న పండ్ల తోటల రైతుసంఘం రాష్ట్ర సదస్సు



మాట్లాడుతున్న పండ్ల తోటల రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పండ్ల తోటల రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19న తాడిపత్రిలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఎపి పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లాలో పండ్ల తోటల విస్తీర్ణం ప్రతి సంవత్సరం పెరుగుతోందన్నారు. జిల్లాలో రెండు లక్షల హెక్టార్లకుపైగా వివిధ రకాలైన పండ్లతోటలు సాగు అవుతున్నాయని, ప్రధానంగా చీనీ, మామిడి, దానిమ్మ, అరటి, రేగు, సపోటా, కలింగర, జామ, బొప్పాయి, ద్రాక్ష, కర్బూజ తదితర పండ్ల తోటలు కాయకూరలు సాగు చేస్తున్నారని తెలిపారు. పండ్ల తోటలో సాగు పెట్టుబడులతో కూడుకున్నది ఎక్కువ భాగం అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఇప్పటికీ సరైన మార్కెట్ సౌకర్యం లేక వ్యాపార వర్గాలు దళారులతో కుమ్మక్కై ఏదో ఒక సాకుతో ధరలు తగ్గిస్తున్నారని, దళారీల మోసాల నుంచి రైతులను కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులు కొందరు వారిచ్చే మామూళ్లకు అలవాటు పడి రైతులను దగా చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో నాలుగు సంవత్సరాలుగా అన్ని రకాల పంటలు పండ్లతోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద విశ్వాసం కోల్పోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. పెరుగుతున్న సాగు ఖర్చులు తగ్గించి ఆత్మహత్యలు నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా పండ్లతోటల రైతులను ఆదుకోవడానికి హార్టికల్చర్ హాబ్ ఏర్పాటుకై ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి రైతుల పంట రుణాలు మాఫీ చేయాలన్నారు. ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేవిధంగా రైతు సమస్యలు పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొదించేందుకు 19న తాడిపత్రి పట్టణంలో ప్రియతమ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి పండ్లతోటల రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.రాజారామిరెడ్డి, బిహెచ్.రాయుడు, పోతలయ్య పాల్గొన్నారు.

వీఆర్‌కు 9 మంది పోలీసులు

మట్కా, పేకాట నిర్వాహకులతో సంబంధాలే కారణం..

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

మట్కా, పేకాట నిర్వాహకులతో సంబంధాలు కొనసాగించిన 9 మంది పోలీసులపై ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కొరడా ఝులిపించారు. ఇందులో భాగంగా జిల్లాలోని గుంతకల్లు, కళ్యాణదుర్గం సబ్ డివిజన్ల పరిధిలోని 9మందికి మట్కా, పేకాటలతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తేలడంతో వీఆర్‌కు తీసుకొచ్చారు. వీరిలో ఒక ఎస్ఐ, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరి అక్రమ వ్యవహారాలపై లోతుగా, సమగ్రంగా విచారించేందుకు డీఎస్పీ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించారు. సదరు ప్రత్యేక అధికారి విచారణలో వీరి అక్రమాలు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, మద్యం, ఇసుక అక్రమ రవాణా ఇలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నడిపించే ఎవరితో సంబంధాలు కొనసాగించినా, ప్రోత్సహించినా, మామూళ్లకు అలవాటు పడినా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, మద్యం, ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా, జిల్లాలో పోలీసులు ఎవరైనా చట్ట వ్యతిరేక శక్తులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నా వెంటనే తన ఫోన్ నెం.94407 96800కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవడంతో పాటు సమాచారం పంపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

చంద్రబాబు అరెస్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హస్తం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


మాట్లాడుతున్న సిపిఐ కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు కలిసి చేసిన వ్యూహరచనలో భాగంగానే టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు చేశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన 114 చెరువుల నీటి సాధన రైతుల సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నికల షెడ్యూలు రావడం, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురవడంతోనే ఆ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరితో కలిసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నారాలోకేష్‌ను కలిశారన్నారు. ఎందుకంటే 12రోజుల పాటు లోకేష్ వారిని కలవడానికి ప్రయత్నించినప్పుడు దొరకని సమయం ఇప్పుడు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో నిరంకుశత్వం పెరిగిపోయిందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను దించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జగదీష్, సంజీవప్ప, గోపాల్, టీడీపీ నాయకులు రామాంజినేయులు పాల్గొన్నారు.

సబ్సిడీతో యాంత్రీకరణ పరికరాలు సరఫరా చేయాలి


మాట్లాడుతున్న ఎడిఎ రవి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రభుత్వం సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలను సరఫరా చేయాలని జడ్పిటిసి భాస్కర్ కోరారు. శుక్రవారం మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పెద్దకొండయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పశుసంపద తగ్గినందున కూలీల కొరత ఏర్పడిందన్నారు. దీన్ని అధిగమించేందుకు రైతులు యాంత్రీకరణ వైపు అడుగులు వేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం గ్రూపుల వారీగా రైతు భరోసా కేంద్రాల్లో ఇస్తున్న మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్లు, స్ప్రేయర్లను వ్యక్తిగతంగా కూడా సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎడి రత్నకుమార్, ఎడిఎ రవి, సర్పంచులు చెదుళ్ల శ్రీనివాసరెడ్డి, కొర్రపాడు ఉపసర్పంచి శ్రీనివాసరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ బయపురెడ్డి, రేకులకుంట లక్ష్మీనారాయణ, కొండారెడ్డి, ఎంపిటిసి శివారెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షులు రమాకాంత్, రైతులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి యోగేశ్వరి అధ్యక్షతను శుక్రవారం నిర్వహించిన సర్వసభ సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ముందుగా మండలవ్యాప్తంగా ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఇందులో భాగంగా లోలూరు పంచాయతీలోని గ్రామాల్లో ఆరు నెలలుగా ఇంటింటికీ రేషన్ సరఫరా చేయడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని లోలూరు ఎంపిటిసి మురార్జీ సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పంచాయతీ నిధులు మంజూరు చేయకపోవడంతో కనీసం బోర్లు కూడా రిపేరు చేయించుకునే స్థితిలో లేమని పెద్దమట్లగొంది సర్పంచ్ రమేష్ వాపోయారు. దీంతో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకు స్పందించిన అధికారులు ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, వైస్ ఎంపిపి నరసయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసులు, వెటర్నరీ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎఒ అన్వేష్‌కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి, ఆర్టికల్ హెచ్‌ఒ శైలజ, ఇఒఆర్‌డి మురళీకృష్ణ, సర్పంచులు తరిమెల రాజారామ్మోహన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సరోజమ్మ, రాజు, నారాయణరెడ్డి, ఎంపిటిసి సునీత, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

మండల ప్రత్యేకాధికారిణి కుష్బూకొఠారి


మిరప పంట కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుని పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారిణి కుష్బూకొఠారి సూచించారు. శుక్రవారం ఉరవకొండ మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసుకున్న రైతులు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే హార్టికల్చర్ పరిధిలో సాగు చేస్తున్న రైతులకు సబ్సిడీతో డ్రిప్పులు, స్ప్రింక్లర్ పైపులు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మిరప పంటకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రమ్మ, జడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, మండల హార్టికల్చర్ అధికారి నెట్టికంటయ్య, వెటర్నరీ వైద్యాధికారి విద్య, ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, సర్పంచి యోగేంద్రారెడ్డి, మండల అగ్రిబోర్డు సభ్యులు ధనుంజయ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సివిఆర్‌టిలో ఫ్రెషర్స్ డే వేడుకలు


ఫ్రెషర్స్‌డేలో పాల్గొన్న డీఎస్పీ సిఎం.గంగయ్య, అతిథులు

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని సర్ సి.వి.రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ సిఎం.గంగయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన లక్ష్యాలను నిర్దేశించుకుని సన్మార్గంలో వాటిని సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ఛైర్మన్ బి.వి.బాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కలల సాకారం కోసం పాటుపడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇందుధరారెడ్డి మాట్లాడుతూ లక్ష్య సాధనలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొన్న వారే అత్యున్నత స్థానాలను చేరుకోగలరన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్.ఐ.గౌస్‌మొహిద్దీన్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుతో ఓట్లు తొలగించే కుట్ర

మాజీమంత్రి పరిటాల సునీత


మాట్లాడుతున్న మాజీమంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-ఆత్మకూరు

టిడిపి అధినేత చంద్రబాబును అరెస్టు చేసి రాష్ట్రంలో గందరగోళ పరిస్థితిని సృష్టించి టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని మాజీమంత్రి పరిటాల సునీత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఎలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పార్టీ కష్టాల్లో ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మనం పార్టీని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అదే సమయంలో చంద్రబాబు అరెస్టుపై నిరసనలు కొనసాగించాలని సూచించారు. ఈ అవకాశాన్ని వైసిపి నాయకులు ఆసరాగా తీసుకుని టిడిపి సానుభూతి పరుల ఓట్లను తొలగించేందుకు పూనుకున్నారని ఆరోపించారు. ఇలాంటి సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మన ఓట్లు కాపాడుకోవడంతో పాటు దొంగఓట్లు ఎక్కించే కుట్రలను తిప్పికొట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా బూత్ లెవల్ ఏజెంట్లు దీనిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా భవిష్యత్తులో చాలా నష్టం జరుగుతుందన్నారు.

మాజీ సర్పంచి మృతికి నివాళి

పుట్లూరు : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచి భూమిరెడ్డి గారి రామకేశవరెడ్డి మృతికి పలువురు శుక్రవారం నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు వెంకట్రామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్లు జెసి ప్రభాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుత్తా వెంకట్‌నాయుడు, ఎమ్మెల్యే పెద్దారెడ్డి సతీమణి రమాదేవి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డ్రెయినేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

మేయర్ మహమ్మద్ వసీం


పనులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో పెండింగ్‌లో ఉన్న డ్రెయినేజీల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. నగరంలోని 22వ డివిజన్ సంగమేష్ సర్కిల్, 29 డివిజన్ అంబేద్కర్ భవన్ ముందు భాగాన జరుగుతున్న పనులను డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయ్ భాస్కర్‌రెడ్డితో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నగరం మీదుగా శారదానగర్, కలెక్టరేట్, సంగమేష్ సర్కిల్, సూర్యానగర్ రోడ్డు, సుభాష్ రోడ్డు, గడియార స్తంభం, నడిమివంక, బైపాస్ వరకు జరుగుతున్న నేషనల్ హైవే పనుల్లో భాగంగా రోడ్డు పక్కన నిర్మిస్తున్న డ్రెయినేజీ కాలువలను కొన్నిచోట్ల అర్ధాంతరంగా నిలిపివేసినట్లు స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన మేయర్ వసీం రోడ్డు పనులు చేపడుతున్న ఎస్ఆర్ నిర్మాణ సంస్థ సిబ్బందిని పిలిపించి త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా 29వ డివిజన్‌లోని రూ.20 లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న కాలువ పనులను పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు. తర్వాత అమృత్ పథకం ద్వారా జరుగుతున్న అశోక్ నగర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. వేగంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య మెరుగుతోపాటు డ్రెయినేజీల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే పాత డ్రెయినేజీల స్థానంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా వెడల్పుగా డ్రెయినేజీలను నిర్మిస్తున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు లీలావతి, సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్ఇ నాగమోహన్, ఇఇ సూర్యనారాయణ, డిఇ సుబాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం ఈవీఎంలు, వివి ప్యాట్స్ ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్సి)పై సన్నద్ధత, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మరియు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్సీ)లో ఎన్నికల కమిషన్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎక్కడ చిన్న తప్పు జరగడానికి వీలు లేదన్నారు. నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం వద్దనున్న ఈవీఎం గోడౌన్లలో నిర్వహించే ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ కోసం అవసరమైన సీసీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు కోసం సన్నద్ధత అత్యంత కీలకమన్నారు. ఇందుకోసం ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, అవసరమైన లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర, హెచ్ఎన్ఎస్-ఎస్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, ఆనంద్, ఈఆర్ఓ వెంకటేశ్వర్లు, డ్వామా పిడి వేణుగోపాల్‌రెడ్డి, ఆన్‌సెట్ సిఈఓ కేశవనాయుడు, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిసిఓ ప్రభాకర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐ జాకీర్ హుస్సేన్, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, కలెక్టరేట్ ఏవో శ్రీధర్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ పుణ్యవతి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు ఎంఎ అడల్ట్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాలను కొనసాగించాలి

కొనసాగుతున్న విద్యార్థి సంఘాల దీక్ష


దీక్షలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్‌కె.యూనివర్శిటీ ఎంఎ అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగంలో మొదటి సంవత్సరం ప్రవేశాలను కొనసాగించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎస్‌కెయు ప్రధాన గేటు ముందు విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టినరిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండోరోజుకు చేరుకున్నాయి. వీరి ఆందోళనకు పూర్తి మద్దతు తెలిపిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం విద్యార్థులు, అధ్యాపకులతో ఎస్‌కె.యూనివర్సిటీ కళకళలాడుతూ ఉండేదన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీలో ప్రొఫెసర్లు, విద్యార్థులు లేరని విభాగాలను రద్దు చేయడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులు చేరేందుకు అనువైన పరిస్థితులు, విధానాలను రూపొందించాల్సిన ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు, విధానాలను రూపొందించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించి అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగం రద్దు నిర్ణయాన్ని తక్షణమే విరమించుకుని, ప్రవేశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసా రాష్ట్ర అధ్యక్షులు వేమన, అకన్న, ప్రతాప్, కళప్ప, ఎఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి పరమేష్, నాయకులు ఉమామహేష్, మంజునాథ్, విశ్వ, సిద్దు, శివ, భీమేష్, యూనివర్సిటీ నాయకులు గిరి, రాజునాయక్, వంశీకృష్ణ, పుల్లలరేవు మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో దసరా సంబరాలు

అనంతపురం : కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ హిందువులకు చాలా ముఖ్యమైన పండుగ అన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, ఏవో గోపాల్, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీరజ భారతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.అలాగే పాములాయి శాలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు సీతారామ లక్ష్మణుడు, రావణాసురుడు వేషాలతో ఎజిఎం సుబ్బారెడ్డికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సమీనాఖాన్, రాయుడు, కరీముల్లా, దర్యావలి, గంగాధర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి వంశీ ప్రియ, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

రైల్వే జంక్షన్ నమూనాను ఆమోదించాలని వినతి

గుత్తి : గుత్తి రైల్వే జంక్షన్‌కు రైల్వే ప్రతిపాదించిన 5వ ఆప్షన్‌ను ఆమోదించాలని కోరుతూ శుక్రవారం గుత్తి కోట సంరక్షణ సమితి, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గుంతకల్లు రైల్వే డివిజినల్ మేనేజర్ మనీష్ అగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయ భాస్కర్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎం.ప్రతాప్ మాట్లాడుతూ 5వ ఆప్షన్ గుత్తి కోట నమూనాతో అద్భుతంగా కనిపిస్తోందని గుత్తి ప్రాంతవాసులు ఇష్టపడుతున్న నమూనా అని వివరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చరణ్ కుమార్, సురేంద్ర, గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు దేవేంద్ర రాయల్, శివకుమార్, శేఖర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్సీ

ఉరవకొండ : ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందిన కూడేరు మండలం గొట్కూరు గ్రామానికి చెందిన బోయ నల్లప్ప కుమారుడు బోయ కరుణాకర్ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. ఈనెల 4న గ్రామ సమీపంలోని తోట వద్ద ప్రమాదవశాత్తు కరుణాకర్ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఇందులో భాగంగా బాధిత కుటుంబానికి ఆర్థికసాయం కింద రూ.5లక్షలు మంజూరు చేయడంతోపాటు మృతుని సోదరుడు కేశవకు కాంట్రాక్టు బేసిక్ కింద ఉద్యోగం ఇవ్వడానికి ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. తమ కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్సీకి మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ సోమర జయ చంద్రనాయుడు, నాయకులు బి.శైలాద్రియాదవ్, తిమ్మారెడ్డి, శివరావు, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

అనంతపురం క్రైం : స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తెలిసీ తెలియని కౌమార ప్రాయంలో విద్యార్థులు డ్రగ్స్ మత్తులో పడి వాటి నుంచి బయట పడలేక శారీరకంగా, మానసికంగా దౌర్భాగ్య స్థితికి చేరి చదువును, భవిష్య జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. డ్రగ్స్ అమ్మకం, రవాణా గురించి సమాచారం తెలిస్తే సెబ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర ప్రసాద్, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు డాక్టర్ నిహారిక ఎంపిక


నిహారికను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం : వచ్చే నెల 1 నుంచి 10వ తేదీ వరకూ విజయవాడలోని ప్రతిష్టాత్మక కెఎల్ యూనివర్సిటీలో 8 రాష్ట్రాల నుంచి ఎంపికైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు అనంత ప్రభుత్వ మెడికల్ కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ డెర్మటాలజీ విద్యనభ్యసిస్తున్న మచాని నిహారిక ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కళాశాలలో నిహారికను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టులో జరిగిన కళాశాల సెలక్షన్స్‌లో మెడికల్ కళాశాల నుంచి నిహారిక ఎంపికై యూనివర్సిటీ స్థాయి సెలక్షన్స్‌కు విజయవాడ వెళ్లగా అక్కడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన విద్యార్థినులు అందరిలో కేవలం ఇద్దరిని మాత్రమే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ కు సెలెక్ట్ చేయగా ఇందులో నిహారిక ఉండడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు, వైస్ ప్రిన్సిపాళ్లుఆరేపల్లి శ్రీదేవి, మేడా ఆత్మారాం, కెఎల్.సుబ్రమణ్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా 'ఉపాధి' ప్రజావేదిక

డిహీరేహాల్ : మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై శుక్రవారం ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజావేదిక తూతూమంత్రంగా సాగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2022-23 సంవత్సరానికి మధ్య రూ.6.40 కోట్ల ఖర్చుతో వివిధ రకాల పనులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. వీటికి సంబంధించి మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.4.30 కోట్లు కూలీలకు వెచ్చించినట్లు డిఆర్పీలు, ఎస్ఆర్పీల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా రూ.6.40కోట్లు ఖర్చు చేయగా ఇందులో కేవలం రూ.40 వేలు మాత్రమే రికవరీకి ఆదేశించడంతో 'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు' ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి సుధాకర్‌రెడ్డి, ఎడిఒ పరమేష్, ఎస్ఆర్‌పి వెంకటేష్‌నాయక్, ఎంపిడిఒ భాస్కర్‌బాబు, వైసిపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, ఓబులాపురం సర్పంచి మల్లికార్జున, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఫలితాలు విడుదల

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో అక్టోబర్-2023లో నిర్వహించిన ఎంటెక్ 1వ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్.21), ఎంసీఏ 4వ సెమిస్టర్ (ఆర్.20) ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం కళాశాల అకాడిమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్స్ డి.విష్ణువర్ధన్, డి.లలితకుమారి, వివిధ విభాగాల అధిపతులు ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కెఎఫ్.భారతి, ఎం.రామశేఖర్‌రెడ్డి, కె.కళ్యాణి రాధ, బి.దిలీప్‌కుమార్, బి.అజిత, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


బాషాసాబ్ (పాతచిత్రం)

బెలుగుప్ప : విద్యుదాఘాతానికి గురై బాషాసాబ్ (58) మృతిచెందిన ఘటన మండల పరిధిలోని గంగవరం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగవరం గ్రామానికి చెందిన బాషాసాబ్ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో బాషాసాబ్ ఉదయాన్నే తన ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌లో పాల పాకెట్ తీసుకునే క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంట్లో ఉన్న భార్య గమనించడంతో చుట్టుపక్కల వారు వచ్చి గమనించేలోపు విగతజీవిగా మారాడు. దీంతో భార్య మహబూబ్‌బీ బోరున విలపించింది. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య హత్యకేసులో భర్త అరెస్టు


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గం : రాయదుర్గం రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని కనేకల్ మండలం సోల్లాపురం గ్రామంలో చిట్టెమ్మ హత్య కేసులో భర్త వన్నూరు స్వామిని అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. రాయదుర్గం రూరల్ సర్కిల్ ఆఫీసులో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ సోల్లాపూరం గ్రామానికి చెందిన చిట్టెమ్మ గత నెల 12వ తేదీ అనారోగ్యంతో మరణించినట్లు భర్త గ్రామస్తులకు తెలిపి అంత్యక్రియలు పూర్తి చేశారన్నారు. చిట్టెమ్మ కుమారుడు సోమశేఖర్ ఊళ్లో లేనప్పుడు ఆమె అంత్యక్రియలు పూర్తి చేయగా మరుసటి రోజున సోమశేఖర్ వచ్చినప్పుడు తాను లేకుండా తల్లి అంత అంత్యక్రియలు ఎలా పూర్తి చేశారని, తనకు ఆమె మతి పై అనుమానం ఉందని ఫిర్యాదు చేయగా కనేకల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. అనంతరం సోమశేఖర్ విజ్ఞప్తి మేరకు కనేకల్ తహశీల్దార్ సమక్షంలో శవాన్ని వెలికి తీసి డాక్టర్లు అక్కడే శవపరీక్ష జరిపినట్లు తెలిపారు. శవపరీక్ష నివేదిక ఆధారంగా చిట్టెమ్మ తలకు బలమైన గాయం కావడం వల్ల మృతి చెంది ఉండవచ్చని వైద్యులు తెలపగా, హత్య కేసు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా వన్నూరు స్వామి శుక్రవారం సోలాపురం గ్రామంలో ఉండగా అతని కణేకల్ ఎస్ఐ, రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్లు విచారణ జరపగా తానే తన భార్యను తలకు కర్రతో బలంగా కొట్టి చంపినట్లు ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచుగా రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కాలువలో మృతదేహం

పట్టించుకోని అధికారులు - దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు

బొమ్మనహాల్ : మండలంలోని దేవగిరి క్రాస్‌లో అరెసముద్రం ప్రధాన కాలువలో గుర్తు తెలియని శవంతోపాటు ఓ గోవు కళేబరం నీటిలో కొట్టుకొచ్చి ఆగిపోయాయి. రెండు రోజుల నుంచి శవం, గోవు కళేబరం ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా నీటి పడి కొట్టుకొచ్చారా.. లేక హత్య చేసి పడేశారా.. అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శవం వీపు, మెడపై తీవ్రమైన గాయాలు ఉండటంతో హత్యగానే స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శవంతోపాటు గోవు కళేబరాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్ట్సుకో కీలక సభ్యుడు మస్తాన్ మృతి


మస్తాన్ (పాతచిత్రం)

అనంతపురం : ఆర్ట్స్ కో (రవాణా కళానిలయం) కీలక సభ్యుడు, లలిత కళా పరిషత్ మాజీ కార్యనిర్వాహక సభ్యుడు మస్తాన్ (70) గురువారం రాత్రి స్వగృహంలో హఠాన్మరణం చెందారు. మస్తాన్ గురువు పులమతి బాలచందర్ పర్యవేక్షణ, శిక్షణలో గొప్ప రంగస్థల నటుడుగా రాణించారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు-క్షీరసాగరమథనం-చిచ్చు-చెదలు-బహురూపి-భేతాళప్రశ్న-మార్పు-రైతంటే-శ్రీరాఘవేంద్ర విజయం ఇత్యాది సామాజిక- చారిత్రక నాటకాలు ఈయన నటన, దర్శకత్వ ప్రతిభకు గీటురాళ్లు అన్నారు. విషయం తెలుసుకున్న ప్రముఖ కవి ఏలూరు యంగన్న, నటుడు సి.రాము, రమేష్, మురళి, చెన్నారెడ్డి, నృత్య శిక్షకుడు పట్నం శివప్రసాద్‌తోపాటు పలువురుకళాకారులు మస్తాన్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

అనంతపురం క్రైం : తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని స్థానిక విద్యుత్‌నగర్‌కు చెందిన నర్మద శుక్రవారం 3వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల మేరకు శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామానికి చెందిన నరేంద్రకుమార్‌రెడ్డికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న నర్మదను వివాహం చేశారు. వీరు నగరంలోని విద్యుత్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. అయితే పెళ్లైన కొద్ది రోజులకే నరేంద్రకుమార్‌రెడ్డి అదనపు కట్నం తీసుకురావాలని నర్మదను చిత్రహింసలకు గురి చేసేవాడు. వేధింపులు భరించలేక నర్మద భర్తపై ఫిర్యాదు చేసింది. సీఐ ధరణీకిషోర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ పాలనలో ప్రజాస్వామ్యానికి ముప్పు

ప్రజాస్వామ్య పరిరక్షణ సైకిల్ యాత్రలో ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజల పక్షాన ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతుకను నొక్కుతూ నియంతృత్వ పరిపాలన రాష్ట్రంలో కొనసాగుతోందని, వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లిందని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తెలియజేసేలా టిడిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అనంతపురం నుంచి అమరావతి వరకు ప్రజాస్వామ్య పరిరక్షన సైకిల్ యాత్ర శుక్రవారం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్.రాజు మాట్లాడుతూ 44 ఏళ్ల చంద్రబాబు నీతి నిజాయితిని రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తెలియజేసి మద్ధతు కూడగట్టేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. చేయని నేరాలను మోపి అక్రమంగా చంద్రబాబును జైలకు పంపించారని మండిపడ్డారు. నాలుగున్నర సంవత్సరాల వైఎస్ఆర్‌సిపి పాలన దుర్మార్గంగా సాగుతోందని, ప్రతిపక్షాలు లేకుండా చేయాలనె కుట్రలతో అక్రమ అరెస్టుల పర్వం ప్రారంభించారని విమర్శించారు. అధికారం ఉందని జగన్ చేస్తున్న రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం నేర్పే రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు. సైకిల్ యాత్రం 18 రోజుల పాటు జరుగుతుందని, మంగళగిరిలోని అంబేద్కర్ విగ్రహ వద్ద సైకిల్ యాత్ర ముగుస్తుందన్నారు. సైకిల్ యాత్ర ప్రారంభానికి టిడిపి నేతలు గాండ్ల విశాలాక్షి తదితరులు హాజరై మద్దతు తెలిపారు.


సైకిల్ యాత్రలో పాల్గొన్న టిడిపి నాయకులు

గ్రామస్థాయిలో మెరుగైన వైద్యసేవలు

ఎంపి తలారి రంగయ్య, విప్ కాపు



రాయదుర్గం 74 ఉడేగోళంలో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

గ్రామీణ ప్రాంతాల్లోనే సత్వర వైద్యసేవలు అందించేందుకే సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకొచ్చారని ఎంపీ తలారి రంగయ్య, విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని 74 ఉడేగోళంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉపేందర్ రెడ్డి, మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు. అలాగే డిగ్రీ కళాశాలలో కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను ఎంపీ, ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి, కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు ఫరీషా, లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, రామకృష్ణ, ఎన్‌సిసి కోఆర్డినేటర్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం గ్రామాల్లో నివసించే ప్రజలకు వరం అని ఎంపిడిఒ విజయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోటంక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలందరు జగనన్న ఆరోగ్య సురక్ష పథకంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తాతి రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : పేదలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించేందుకే సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని డిఎంఅండ్‌హెచ్ఒ ఇబి.దేవి తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నార్పల, రాప్తాడు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రసన్నాయనపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను డిఎంఅండ్‌హెచ్ఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసమే సిఎం జగన్ ఈ పథకం తీసుకొచ్చారన్నారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : పేదలు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా, ఇంటి వద్దకే వైద్యాన్ని అందిస్తున్న ఏకైక సిఎం జగన్ అని వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 1, 4వ గ్రామ సచివాలయల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారిణి ఇబి.దేవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ, ఎంపిడిఒ దివాకర్, తహాశీల్దార్ హరికుమార్, సర్పంచు సుప్రియ, ఉపసర్పంచి శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, కార్యదర్శులు పరశురాముడు, చరణ్, వైద్యులు ప్రవీణ్‌కుమార్, రవిశంకర్, సిహెచ్ఓ బాలాజీ, సూపర్‌వైజర్లు అకులప్ప, నాయకులు మన్నీల శివయ్య, భాస్కర్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, చికెన్ గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

ఉరవకొండ : అందరి ఆరోగ్యాన్ని కాపాడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని 5వ సచివాలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇళ్ల వద్దకే వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా దాదాపు 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలితమ్మ, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జడ్పిటిసి పార్వతమ్మ, ప్రత్యేకాధికారిణి కుష్బూకొఠారి, పెన్నఅహోబిలం మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, ఎంబీసీ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేష్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, వక్ఫ్ బోర్డు మీరం బాషా, పిఎసిఎస్ సొసైటీ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, మండల సమన్వయకర్త ఓబన్న, కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీం, తహాశీల్దార్ హరిప్రసాద్, ఇఒఆర్‌డి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు, నాయకులు దండిన శివానంద, భరత్‌రెడ్డి,కరణం భీమిరెడ్డి, ఇఒఆర్‌డి సత్యబాబు, సర్పంచి బ్యాలా రాణి రాజశేఖర్, వైద్యాధికారులు రాజేంద్ర, అరుణకుమారి, ఎంపిటిసి దాసరి వెంకటేష్, శివ, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు డిష్ వెంకటేష్, నల్ల సుంకన్న, షణ్ముఖగౌడ్, హావలిగి ఎంపీటీసీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : ప్రజలకు మరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి దాసరి సునీత అన్నారు. శుక్రవారం మండలంలోని కెకె అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 305 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మందిని అదనపు వైద్యం కోసం వివిధ ఆసుపత్రులకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భాస్కర్, జెసిఎస్ మండల కన్వీనర్ బైపిరెడ్డి, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ తేజస్వి, డాక్టర్ సయ్యద్ బాబ్‌జాన్, తేహరినూష, ఎంపిడిఒ తేజోష్ణ, ఇఒఆర్‌డి దామోదరమ్మ, మండల సామాజిక ఆరోగ్య అధికారి మోహన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్, సూపర్‌వైజర్లు శ్రీదేవి, కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కందికాపుల సచివాలయంలో ఏర్పాట చేసిన జగనన్న ఆరోగ్య సురక్షలో 219 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో కొంతమందిని వివిధ ఆసుపత్రులకు సిఫారసు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఏం జరిగినా జగన్‌దే బాధ్యత

టిడిపి నాయకులు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జైలులో ఎటువంటి హాని జరిగిన ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, సిఐడి అధికారులదే బాధ్యత వహించాల్సి ఉంటుందని టిడిపి అనంతపురం అర్బన్ నాయకులు అన్నారు. శుక్రవారం అర్బన్ టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో నారా లోకేష్ కాలనీలో చంద్రబాబు అక్రమ అరెస్టుపై ఇంటింటికి కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జి గోపాల్ గౌడ్, తెలుగు యువత నాయకులు బంగినాగ, మట్ట కేశవ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును జైలులో మట్టు పెట్టడానికి, జగన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ఆయనకి ఏమైనా జరిగినా పూర్తి బాధ్యత జగన్ రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని, హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మంది తెలుగు సైనికులు ఉన్నారని మొత్తంగా జగన్ రెడ్డి ప్యాలెస్ ముట్టడిస్తామన్నారు. ఇప్పటికైనా తప్పు తెలుసుకుని చంద్రబాబును బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, జిల్లా అధికారి ప్రతినిధి సరిపూటీ రమణ, నటేష్ చౌదరి, ముక్తియార్, అజీజ్, ఈటెస్వామి దాస్, జేయం బాషా, విజయశ్రీరెడ్డి, వసుందర, సుజాత, అంజి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

నార్పల : మండల పరిధిలోని బండ్లపల్లిలో బి.పప్పూరు పశు వైద్య అధికారి రాధిక అధ్వర్యంలో శుక్రవారం ఉచిత గర్భ కోశ చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ 90శాతం కచ్చితత్వంతో పేయిదూడల పుట్టుక కోసం లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.1,350 సూదులను సబ్సిడీ పోను రూ.500కు మాత్రమే వేయనున్నట్లు తెలిపారు. రెండు సూదులు వేసినా కట్టకపోతే రూ.500 వాపస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పొరపాటున కుర్ర దూడ పుడితే రూ.250 వెనక్కి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వెంకట నారాయణమ్మ, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ వి.ఎ.శ్రీనివాస, ఎహెచ్ఎ చైతన్య, గోపాలమిత్రలు నరసప్ప, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌పై సిఎం అనుచిత వ్యాఖ్యలు తగదు

బుక్కరాయసముద్రం : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై సిఎం జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని జనసేన నాయకురాలు శశిరేఖ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. పవన్‌కళ్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని విమర్శిస్తూ మహిళలను అవమానించేలా జగన్ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమన్నారు. ప్రజాక్షేత్రంలో పవన్‌కళ్యాణ్‌ను ఎదుర్కోలేకనే సిఎం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. జగన్ తన సొంత చెల్లెలికి ఎన్ని వివాహాలు చేశారో చెబితే చాలా బాగుంటుందన్నారు. సిగ్గు, శరం లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడితే ప్రజలే నడిరోడ్డుపై బుద్ధి చెబుతారన్నారు.

దళితుల ఆస్తులను కాపాడాలి

బుక్కరాయసముద్రం : దళితుల ఆస్తులను దోసుకుంటున్న ధనికులు, భూ కబ్జా దారులపై చర్యలు తీసుకుని ఆస్తులను కాపాడాలని ఎస్సీ ఎస్టీ జేఏసీ సాకే హరి అన్నారు. దళితుల భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండలంలోని తహాశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకుని అన్యాయం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహాశీల్దార్ నారాయణస్వామి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు కొర్రపాడు నాగేంద్ర, శింగంపల్లి కేశవ, కుళ్లాయిస్వామి, రాఘవేంద్ర, కుమార్, రామకృష్ణ, రాజన్న, బాబు, భూ బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం క్షమాపణలు చెప్పాలి

అనంతపురం : ముఖ్యమంత్రి జగన్ వెంటనే జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌కు క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తే సమాధానం చెప్పకుండా పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణలు చేయడం బాధాకరమన్నారు. పవన్‌కళ్యాణ్ నామస్మరణ వైసిపికి తారకమంత్రంలా ఉందన్నారు. తాము కూడా స్థాయి తగ్గించుకుని మీ వ్యక్తిగత విషయాలను మాట్లాడాల్సి వస్తే తల ఎక్కడ పెట్టుకుంటారో చెప్పాలని నిలదీశారు. ముఖ్యంగా సిఎం జగన్ తండ్రి చనిపోయినప్పుడు కలకత్తాలో ఏం చేస్తున్నారో, బెంగళూరు ప్యాలెస్‌లో ఏం చేసే వారో.. మీ రాసలీల గురించి ఎవరికీ తెలి యదు అనుకుంటే పొరపాటే అవుతుందన్నారు. వీధి వీధిలో రచ్చబండల వద్ద మీ బండారం బయట పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని పవన్ కళ్యాణ్ లేవనెత్తుతున్న వ్యవస్థీకృత ప్రశ్నలకు హుందాగా సమాధానం చెబితే బాగుంటుందని, అలాకాకుండా వ్యక్తిగత దూషణలకు దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

నీళ్ల ట్యాంకర్ బోల్తా..

గుత్తి : పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో గురువారం అర్ధరాత్రి మున్సిపల్ వాటర్ ట్యాంకర్ బోల్తా పడింది. గాంధీ నగర్ కు తాగునీటిని వదిలేందుకు వస్తున్న ట్యాంకర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. అయితే ఆ సమయంలో రహదారిపై జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ట్యాంకర్ డ్రైవర్ తిమ్మప్ప స్వల్ప గాయాలకు బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ట్రాన్స్ కో, మున్సిపల్ సిబ్బంది అక్కడ చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కొంతసేపు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీలకు గాయాలు

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యవసాయ కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఉబిచెర్ల గ్రామంలో వేరుశనగ కోతకు వచ్చిన యంత్రం అదుపుతప్పి పంట పొలాల్లోకి బోల్తా పడింది. ప్రమాదంలో కరిడికొండకు చెందిన లక్ష్మీదేవి, వరలక్ష్మి, మహాలక్ష్మి, ఉబిచెర్ల చెందిన శ్రీలక్ష్మీదేవి తోపాటు మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కేబుల్ వైర్ చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామానికి చెందిన 9 మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు రైతులు వాపోయారు. మునిరెడ్డికి చెందిన మూడు, కొండారెడ్డికి చెందిన ఒకటి, వెంకట్‌రెడ్డికి చెందిన 1, గంగిరెడ్డితోపాటు మరికొంతమందికి చెందిన రైతుల కేబుల్ వైర్లను గురువారం రాత్రి చోరీ చేసినట్లు తెలిపారు. నిన్న డ్రిప్పులు, నేడు కేబుల్ వైర్లు చోరీ చేసిన విషయం తెలిసిందే. దీంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

సెబ్ పోలీసుల దాడులు



మద్యం వివరాలను వెల్లడిస్తున్న సెబ్ అధికారులు

అనంతపురం క్రైం : ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు సెబ్ విభాగం పోలీసులు జిల్లావ్యాప్తంగా దాడులు నిర్వహించారు. 6 కేసులు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేయడంతో పాటు 1368 టెట్రా పాకెట్లు, ఒక ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు. గుంతకల్, కంబదూరు, కళ్యాణదుర్గం, రాయదుర్గం సెబ్ స్టేషన్ పరిధిలో ఆయా సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 6 కేసులు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేసి 1368 టెట్రా పాకెట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. గుత్తి సెబ్ స్టేషన్ పరిధిలో ఒక నాటుసారా కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఇంటెలిజెన్స్ విభాగం 3 వ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేశారు.

పేకాట జూదరుల అరెస్టు

అనంతపురం క్రైం: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు వన్ టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసులు నగరంలోని ఓ లాడ్జి పై దాడులు నిర్వహించారు. నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.27,500 నగదు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.